క్లుప్తంగా

వెంకన్నకు పంచామృతాభిషేకం



ఎమ్మెల్యే లలితకుమారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందిస్తున్న అర్చకులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో సుప్రభాతసేవ అనంతరం స్వామికి విశేష పంచామృతాభిషేకం చేశారు. ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. స్వామివారికి ముడుపులు చెల్లించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఎమ్మెల్యే లలితకుమారికి ప్రసాదం, జ్ఞాపిక అందించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

విద్యార్థినికి అభినందన



విద్యార్థి కుసుమను అభినందిస్తున్న గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు

పరవాడ: మండలంలోని రావాడ శివారు ధర్మారాయుడుపేట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన కోన కుసుమ అనే విద్యార్థిని నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు ఎంపికై నట్లు పాఠశాల హెచ్ఎం వి.సన్యాసి చెప్పారు. కుసుమకు ఏటా రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు స్కాలర్‌షిప్ అందుతుంది. పాఠశాలలో చదువుతున్న మిగిలిన విద్యార్థులు కూడా స్కాలర్‌షిప్ పొందే విధంగా కృషి చేయాలని గ్రామ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు కోరారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన కుసుమను సర్పంచ్ సన్యాసినాయుడు, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థి ప్రసన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు

పెందుర్తి: సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కల సమేత శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో ఉత్తర నక్షత్రం పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి విశేష అభిషేకాలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

అప్పన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే వెలగపూడి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభానికి మొక్కుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో స్వామికి అర్చకులు పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

మందుబాబులకు రూ.35 వేల జరిమానా

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 8 మందికి ఐదో స్పెషల్ మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ కోర్టు జరిమానా విధించింది. ఒక్కొక్కరికి రూ.2 వేల నుంచి 3 వేలు అపరాధ రుసుము విధించినట్లు ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు తెలిపారు. ఎనిమిది మందికి మొత్తం రూ.35 వేల జరిమానా కోర్టు విధించినట్లు చెప్పారు.

రక్తదానం అభినందనీయం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోసం రక్తదానం చేయడం అభినందనీయమని ఆంధ్రా మెడికల్ కాలేజీ పూర్వ ప్రిన్సిపాల్, ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ సుధాకర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ కళాక్షేత్రంలో శుక్రవారం 7వ సారి రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన రక్తం ఇవ్వడానికి గత ఏడేళ్లుగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఒక వ్యక్తి రక్తదానం చేయడం ద్వారా 10 మంది రోగులకు అవసరమైన చికిత్స జరుగుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ హనీఫ్, ఉక్కు ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ సారంగి, వార్డు కార్పొరేటర్ గంగారావు శిబిరాన్ని సందర్శించారు. రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్, లైఫ్‌షేర్ బ్లడ్ బ్యాంకుల ఆధ్వర్యంలో 300 యూనిట్లు సేకరించారు.

చేపల వేటకు వేళాయె..

- తీరానికి చేరిన వలలు, బోట్లు
- సిద్ధమైన మత్స్యకారులు
- వేట కలసి రావాలని గంగమ్మ తల్లికి పూజలు
- నేటి నుంచి సంద్రంలోకి గంగపుత్రులు



తీరం నుంచి సముద్రంలోకి బోట్లు తీసుకువెళుతున్న మత్స్యకారులు



ముత్యాలమ్మపాలెం తీరంలో పడవలను సిద్ధం చేస్తున్న మత్స్యకారులు

పరవాడ: గంగపుత్రులు చేపల వేటకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. సముద్రంలో చేపల వేట నిషేధ కాలం ముగియడంతో ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, జాలరిపేట మత్స్యకార్మికులు సముద్రంపై చేపల వేట సాగించేందుకు వేట సామగ్రి సిద్ధం చేశారు. తమ చేపల వేట సజావుగా సాగాలని గంగమ్మ తల్లికి పూజలు జరిపారు. గతేడాది తరచూ సంభవించిన తుఫాన్ల కారణంగా చేపల వేట సక్రమంగా సాగక నష్టాలు చవిచూసిన తమకు ఈ ఏడాదైనా ప్రకృతి కరుణించాలని వేడుకున్నారు. వేట ముమ్మరంగా సాగాలని గంగమ్మ తల్లిని పూజించి చేపల వేటకు సమాయత్తమవుతున్నారు. ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు సముద్రంలో చేపల పునరోత్పత్తి సీజన్ కావడంతో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా సముద్రంపై చేపల వేటను నిషేధించిన విషయం తెలిసిందే. 61 రోజులు మత్స్యకార్మికులు చేపల వేట మానుకొని చినిగిన వలలు, పాడైన పడవలను తయారు చేసుకుంటారు. వేట నిషేధం సమయం జూన్ 15 అర్ధరాత్రితో పూర్తి కావడంతో గంగపుత్రులు వేటకు సన్నాహాలు ప్రారంభించారు. మత్స్యకార గ్రామాలైన ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం, జాలరిపేట, తిక్కవానిపాలెం గ్రామాల్లో సుమారు 120 పైగా పడవలు చేపల వేట సాగిస్తున్నాయి. వీటిపై ఆధారపడి వందలాది మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. రెండు మాసాలుగా చేపల వేట సాగించని కారణంగా సముద్రంలో మత్స్య సంపద పుష్కలంగా ఉంటుంది. తమ వలలకు పెద్ద మొత్తంలో చేపలు చిక్కుతాయని వేటకు సిద్ధమైన మత్స్యకార్మికులు భావిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో ప్రకృతి విపత్తుల రూపంలో గంగపుత్రులకు కష్టాలు దాగి ఉన్నాయి. సముద్ర గర్భంలో ఏర్పడుతున్న తుఫాన్లు, అల్పపీడనాల వల్ల తమకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా వలలకు పెద్ద మొత్తంలో చేపలు చిక్కే విధంగా ఆశీర్వదించాలని ముత్యాలమ్మపాలెం గంగపుత్రులు గంగమ్మతల్లికి పూజలు చేశారు.

దేవస్థానం పాఠశాలలో సకల సౌకర్యాలు

- ఈవో శ్రీనివాసమూర్తి
- విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన సంస్కృతోన్నతపాఠశాల ఆవరణలోనే విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తామని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. అందుకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని దేవస్థానం ఈఈ రాంబాబును ఆదేశించారు. పాఠశాలను శుక్రవారం ఈవో సందర్శించారు. 1994,1995,2002,2003 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులతో పాటు మాస్టర్ ఈకే స్పిర్చువల్ సేవా సంస్థలు, గొడవర్తి వంశీ అండ్ ఫ్రెండ్స్ వితరణగా అందించిన నోట్ పుస్తకాలను ఈవో విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలకు ఎంతో ఘనకీర్తి ఉందన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు దేశవిదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని వివరించారు. పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణత రావడం గర్వించదగ్గ విషయమన్నారు. హాస్టల్ ఒకచోట, పాఠశాల మరోచోట ఉండడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్టు గ్రహించామన్నారు. త్వరలో పాఠశాల క్యాంపస్‌లోనే హాస్టల్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. దానికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల సూపరింటెండెంట్ విక్రమ్, ప్రధానోపాధ్యాయురాలు భాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో లక్ష్మణరావు తదితరులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు,నోట్ పుస్తకాలు శుక్రవారం పంపిణీ చేశారు. మండల విద్యాశాఖాధికారులు ఎస్. లక్ష్మణరావు, బీఎస్ఎన్ మూర్తి చేతుల మీదుగా పుస్తకాలు అందజేశారు. ఎంఈవో లక్ష్మణరావు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి స్టూడెంట్స్ కిట్స్ 54 పాఠశాలలకు గాను 40 పాఠశాలలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు.బాలురకు యూనిఫాం రావాల్సి ఉందని చెప్పారు.జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు పాఠ్యపుస్తకాలు,నోట్ పుస్తకాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. తిరుపతి రావుతో పాటు పాఠశాల బోధన,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

దేవీపురంలో శ్రీవిద్య ప్రారంభిక కోర్సు ప్రారంభం



శ్రీవిద్య కోర్సు నేర్చుకునేందుకు వచ్చిన విద్యార్థులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో శ్రీవిద్య ప్రారంభిక కోర్సును శక్రవారం ప్రారంభించారు.తెలుగు భాషా మాధ్యమంగా ఈ నెల 14 నుంచి 17 వరకూ నాలుగు రోజులు పాటు నిర్వహించనున్న ఈ కోర్సును గురుమాత అన్నపూర్ణమ్మ ప్రారంభించారు. చెన్నై,కోయంబత్తూర్,ఆగ్రా,కోల్‌కతా, బెంగళూర్,రాయపూర్,ఢిల్లీతో పాటు యూరప్‌లోని లాత్వియా నుంచి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులకు ముందుగా గురు పాదుకా మంత్రోపదేశం చేసి కోర్సును ప్రారంభించారు. శ్రీగణపతి,బాల,చండీ మంత్రోపదేశాలు చేశారు. నాలుగు రోజుల్లో వీరు మంత్ర సాధన,యంత్రపూజ,తర్పణాల థియరీతో పాటు ఆచరణపూర్వకంగా ఉపాసనా విధానాలను నేర్చుకుంటారన్నారు. గురుమాత అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ తమ అనుగ్రహ భాష్యంలో అనేక మంది ప్రాంతీయతతో సంబంధం లేకుండా అమ్మవారి ఉపాసన నేర్చుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో కందర్ప ప్రభాకర్‌తో పాటు ఆచార్యులు మూర్తి రాధ,కందర్ప రమ,వి. షణ్ముఖేశ్వరన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కాంట్రాక్ట్ కార్మికుడు మృతి



సంజీవరావు మృతదేహం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. అగనంపూడి ప్రాంతానికి చెందిన పి.సంజీవరావు (39) బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో కాంట్రాక్ట్ కార్మికునిగా పని చేస్తున్నాడు. ఈ నెల 12న విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా, మెయిన్ గేటు బయట ఉన్న పైలాన్ వద్దకు వచ్చేసరికి ఏపీ 33 సీ 1683 కారు బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన సంజీవరావును నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి ఆయన మృతి చెందారు. కారు నడిపిన వ్యక్తి కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

28న 100వ తపాలా డాక్ అదాలత్

ఎంవీపీ కాలనీ: తపాలా వినియోగదారుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి ఈ నెల 28న ఎంవీపీ కాలనీలోని తపాలా శాఖ రీజనల్ కార్యాలయంలో 100వ తపాలా డాక్ అదాలత్ నిర్వహించనున్నట్టు ఆర్ఎంఎస్-వీ డివిజన్ సూపరింటెండెంట్ ప్రసన్నరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 100వ డాక్/ పెన్షన్స్ అదాలత్‌గా దీన్ని నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అల్లూరి, పార్వతీపురం, కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన తపాలా వినియోగదారులు తమ సమస్యలను ఈ నెల 21వ తేదీ లోపు ఎంవీపీ కాలనీలోని రీజనల్ కార్యాలయం చిరునామాకు అందజేయాలన్నారు. అనంతరం 28వ తేదీ జరిగే డాక్ అదాలత్‌లో వాటిని పరిష్కరించనున్నట్లు తెలిపారు.

ఇంధన వనరులను ఆదా చేద్దాం



ఇంధన వనరుల పొదుపు గురించి విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస: తరిగిపోని శక్తి వనరు అయిన సూర్యరశ్మిని వినియోగించుకుని పర్యావరణానికి హాని కలిగించే ఇంధన వనరులను క్రమేణా తగ్గించుకోవాలని చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని సీహెచ్ రోజామణి విద్యార్థులకు సూచించారు. బొగ్గు, గ్యాస్, ఖనిజ ఇంధనాలు తదితర పరిమిత వనరుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. హైస్కూల్ ఆవరణలో ×మిషన్ లైఫ్ కోసం ఎకో క్లబ్₹ అనే థీమ్ కార్యక్రమాల్లో భాగంగా శక్తిని ఆదా చేయడానికి గల కారణాలు, ప్రాధాన్యతను విద్యార్థినులకు వివరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తి, సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రచారంలో ప్రతీ విద్యార్థి భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించి, మొక్కలు నాటేలా ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు కె.రామలక్ష్మి, ఎస్.ఉదయ కుమార్, సీహెచ్.డి.వి.రాణి, భాగ్యవతి, మాధవి, భీమాబాయి, పీపీ లక్ష్మి, సత్యవతి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గొంతెత్తాలి

అగనంపూడి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా రాష్ట్ర ఎంపీలు పార్లమెంట్‌లో గొంతెత్తాలని ఉక్కు పోరాట కమిటీ నాయకుడు డి.ఆదినారాయణ కోరారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల మొదటి రోజున వ్యతిరేక తీర్మానం చేయాలన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నేతృత్వంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షల్లో 1219వ రోజు శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉక్కు ప్రైవేటీకరణ విషయంలో కేంద్రం అనుసరించిన వైఖరి ఇప్పటి వరకు ఒక ఎత్తు కాగా, సంకీర్ణ ప్రభుత్వంలో మరో వైఖరి అవలంబించడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో ఎంపీలంతా పట్టుబడితే సత్ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో నాయకులు వి.శ్రీనివాసరావు, లక్ష్మణరావు, శ్రీనివాసరావు, హరినాథ్, పి.వి.రమణ, దానయ్య, సంతోష్‌కుమార్, దాసుబాబు, వెంకటమ్మ మాట్లాడారు. దీక్ష శిబిరంలో ట్రాఫిక్ విభాగం, ఆర్ఎండీ, కన్‌స్ట్రక్షన్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో పాల్గొన్న కమిటీ నాయకులు

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న నాయకులు

సీతమ్మధార : ప్రాణత్యాగం చేసైనా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించకుందామని సీఐటీయూ జిల్లా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వై.రాజు అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న నిరాహారదీక్ష 1141వ రోజు శిబిరంలో ఆయన మాట్లాడారు. అఖిలపక్ష కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా, మేధావులు అందరూ ఒక్క తాటిపైకి వచ్చి పోరాటం సాగిస్తున్నట్లు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ లాభాల్లో నడుస్తోందన్నారు. అటువంటి సంస్థను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే ఉన్న ఉద్యోగాలు పోవడంతో పాటు తర్వాతి తరాలకు ఉపాధి ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు కేంద్రంతో మాట్లాడి ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, భవన నిర్మాణ కార్మిక నాయకులు కె.నర్సింగరావు, ఎర్రిబాబు, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం అనంతరం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం ,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అధికారులు అందజేశారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ రామకృష్ణ

పెందుర్తి: ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా పెందుర్తి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద నిర్వహించిన రక్తదాన శిబిరానికి చక్కటి స్పందన లభించింది. మదర్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు మొత్తం 52 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రాణాపాయంలో ఉన్న వారి కోసం రక్తదానం చేయడం ఎంతో పుణ్యఫలం అన్నారు. ఒకరు రక్తదానం చేస్తే ముగ్గురు ప్రాణాలు నిలబెట్టిన వారవుతారన్నారు. ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలతో పాటు మొక్క అందజేశారు. చింతలగ్రహారం గ్రామంలో సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో వందే భారత్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు 23 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. నాయకులు దాడి రమణచిట్టి, దాడి అప్పలనాయుడు, ఆళ్ల తాతారావు, మద్దాల శ్రీనివాసరావు, ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీనివాస్, ట్రస్ట్ ప్రతినిధులు సిరిమళ్ల గణేష్, గంగాధర్, మణి, పెంటకోట గణేష్, దాడి సురేష్, పి.ఉమాశంకర్, తేజ, నారాయణ, బి.సురేష్, సూర్య, పి.భాను, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



వాడచీపురుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు, అధికారులు

పరవాడ: మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా వాడచీపురుపల్లిలో శుక్రవారం గ్రామ సచివాలయ ఉద్యోగులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ శివలంక లక్ష్మి మాట్లాడుతూ మలేరియా రాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మలేరియా వ్యాధి, నివారణ పై అందరు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మలేరియా పై అవగాహన కల్పిస్తూ వాడచీపురుపల్లి వీధుల్లో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, వైస్ సర్పంచ్ కూండ్రపు శ్రీను, పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధికి శాస్త్ర విద్య దోహదం

ఆర్జేడీ విజయభాస్కర్



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

సింహాచలం: శాస్త్ర విద్య అనేది సమాజ అభివృద్ధికి ఆధారమైనది.. జీవశాస్త్రాన్ని బోధించే ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు సాంకేతికతను అప్‌గ్రేడ్ చేసుకుంటూ నాణ్యమైన బోధన అందించాలని ఆర్జేడీ విజయభాస్కర్ సూచించారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో విశాఖ జిల్లాలోని జీవశాస్త్ర ఉపాధ్యాయులకు నైపుణ్యాల పెంపుపై శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన 250 మంది జీవశాస్త్ర ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఆర్జేడీ విజయభాస్కర్ మాట్లాడుతూ శాస్త్ర విద్య ఎంత నేర్చుకున్నా తరగనిదన్నారు. కొత్తగా ఆలోచించాలని, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలన్నారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ ఉపాధ్యాయులు శాస్త్ర నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం కోసం ఓరియంటేషన్ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు, రిసోర్సు పర్సన్స్ ఎస్.బాబూరావు, జి.చంద్రమౌళి, సీహెచ్.రాధాకృష్ణ, పి.రవిప్రసాద్, ఎంవి.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ కార్మికుల అర్హతలపై ఫిర్యాదు

అగనంపూడి: విశాఖ ఉక్కు పరిసరాల విభాగం పరిధిలోని హార్టికల్చర్ సొసైటీల్లో పనిచేసే కార్మికుల అర్హతలపై సొసైటీ సభ్యురాలు దేవర అప్పలకొండమ్మ జిల్లా సహకార శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. సొసైటీ విధి విధానాలు, పాలనాపరమైన అంశాలు, సభ్యుల గరిష్ట వయోపరిమితి, ప్రస్తుతం పనిచేస్తున్న సభ్యుల వయసు, పుట్టిన తేదీలు, పనిచేస్తున్న నిర్వాసితులు, నిర్వాసేతరుల వివరాలు కావాలని సొసైటీని సమాచార హక్కు చట్టం ద్వారా కోరామని, వివరాలు ఇవ్వక పోవడంతో ఫిర్యాదు చేస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు.